రిటర్న్ టికెట్ నేను తీసుకోలే... ఆయనే వెళ్ళిపోయాడు

కె. జయశ్రీ*

రాయడమే రాని నాకు సార్ గురించి రాయాలంటే బ్రహ్మప్రళయంగా వుంది. 1988 జనవరిలో కడపలో ఎ.పి.సి.యల్.సి ఏర్పడింది. సార్ ఎవరో ఎపిసియల్సి అంటే ఏమిటో నాకు తెలియదు. కేవలం అన్నలకు లాయర్‌గా వున్న పరిచయం వల్లనే నేను కమిటీలోకి రావడం జరిగింది. పోలీసుల వేధింపులపై కోర్టులోపలా బయటా ప్రశ్నించడం లాంటి పనులు చేయగలిగిన లాయర్ ప్రెసిడెంట్‌గా వుంటే బాగుంటుందని సార్ అన్నారు. ఇద్దరమే లాయర్లం ఉన్నాం. రెండో అతను ముందుకు రాకపోవడంతో సార్ నన్ను అడిగారు. నా గుండె జబ్బు, ఎక్కడికీ తిరగలేని పరిస్థితి, ఎం.వి. రమణారెడ్డికి అడ్వకేటుగా పనిచేయడము.... సకల సుగుణాలు చెప్పినాను. అయినా ఎవ్వరూ లేనందున నన్నే తీసుకున్నారు.

ఆ తర్వాత సార్ మాతో పనిచేయించడానికి పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఉదయాన్నే వచ్చి నేను నిద్ర లేచి రెడీ అయ్యేంతవరకు అంటే దాదాపు 9 గంటల వరకు వెయిట్ చేసేవారు. ఆ తర్వాత విషయం చెప్పి, నాకు అర్థము చేయించి, అందుబాటులో వున్న వాళ్లను పిలుచుకొనిపోయి నిజనిర్ధారణ చేసి పత్రికా ప్రకటనలు ఇచ్చి నన్ను ఇంట్లో దిగబెట్టి తన ప్రయాణం చూసుకొనేవారు. మొదట్లో ఆయన రాకపోకల గురించి ముందుగా తెలిసేది కాదు. పత్రికలవల్లనో ఎవరిద్వారానో తెలిసిందనో తనంతకుతాను వచ్చి మా నిద్రకు భంగం కాకూడదని తెల్లవారే వరకు బయటనే వుండి పూర్తి తెల్లవారాక వచ్చేవాడు. మాకు ఈ విషయాలు అర్థమైన

---

* మానవహక్కుల వేదిక కడప జిల్లా కన్వీనర్, ప్రొద్దుటూరు

తరువాత చాలా నిష్ఠూరం పడినాకనే ఆయన ఏ సమయంలోనైనా ఇంటికి నేరుగా రావడం మొదలుపెట్టాడు.

ఒకసారి తాడిపత్రి బస్టాండులో అర్థరాత్రి ఉండిపోవాల్సి వచ్చింది. న్యూస్‌పేపర్ ఇచ్చి బెంచిమీద పడుకోమంటే నేను ఏంది సార్ ఇక్కడ పడుకోమంటారా అంటే సరే కూర్చో నా బ్యాగ్ చూడు అని అన్నాడు. ఏముంది ఆ బ్యాగులో పాత బట్టలు తప్ప అని నేనంటే భలేదానివే నా పుస్తకాలూ, డైరీ పోతే ఎలా అని ఆయన అమూల్యమైన ఆస్తి గురించి బాధపడినాడు. సంస్థ ఏర్పాటు చేసిన కొత్తల్లోనే స్థానిక సమస్యలపై తన కొరకు ఎదురు చూడకుండా స్వతంత్రంగా పనిచేయమని చెప్పేవాడు. అప్పటికి ఫోన్‌లు లేవు. ఉత్తరాలు రావడం చాలా ఆలస్యం.

ధర్నా ధర్మాన..

ప్రొద్దుటూరులో మహిళల వేధింపులు, వరకట్న చావులకు వ్యతిరేకంగా పని చేయడం మొదలుపెట్టిన వెంటనే ఏపిసియల్‌సికి సభ్యుల సంఖ్య పెరిగింది. స్థానికంగా ఉన్న పేదల ఇళ్ల పట్టాల సమస్యపై ధర్నా చేయాలని ఒకసారి నిర్ణయించుకున్నాం. అప్పటికి నాకు ధర్నా అంటే ఏంటో తెలీదు. కలెక్టరేట్ ఎదుట ఓ షామియానా టెంట్ వేసి, బాధితులతో కలిసి కొంతసేపు నినాదాలు, ఆ తర్వాత ఉపన్యాసాలు... చివరగా కలెక్టరుకు వినతిపత్రం ఇవ్వడంతో ఆ కార్యక్రమం ముగియడం చూశాను. ఓ టెంటు... నినాదాలు, ఉపన్యాసాలు, వినతిపత్రం ఓస్... ఇంతేనా ధర్నా అంటే అని అనుకున్నాను. ఆ తర్వాత జిల్లాలో రాడికల్ సభలకు పోలీసులు అనుమతి నిరాకరించినపుడు వెంటనే ధర్నా గుర్తుకొచ్చింది. చకచకా ఏర్పాట్లు చేసుకున్నాం. జిల్లా యస్.పి. కార్యాలయం ఎదుట ధర్నాకు టెంటు వేశాం. ధర్నా మొదలయ్యీ కాకముందే పోలీసు పటాలం వచ్చింది. మమ్మల్నందరినీ వ్యాన్‌లో పడేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణంలో వెంటనే పోలీస్ కవాతు జరిగింది. కేసులు పెట్టారు. మాలో చాలామందిని పోలీసులు బెదిరించారు. దీంతో ఏపిసియల్‌సి సభ్యత్వం టపాటపా పడిపోయింది. చాలామంది రాజీనామాలు చేశారు. అప్పుడుగానీ దేనికి ధర్నా చేయాలో దేనికి చేయకూడదో బోధపడలేదు.

ఆరోజు నుంచి యస్.పి.కి, ఏపిసియల్‌సికి మధ్య స్టేట్‌మెంట్ వార్ జరిగింది. అప్పటికే అన్నలు పనిచేస్తున్న రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంత ప్రజలపై పోలీసుల దాడుల గురించి బాలగోపాల్ అప్పటి కడప ఎస్పీ కెప్టెన్ కె.వి. రెడ్డిని ప్రశ్నించారు. నక్సలైట్ల రాజకీయాలపై ఎస్పీ రాజకీయ వ్యాఖ్యానాలు చేయడంతో బాలగోపాల్ చాలా సీరియస్ అయ్యారు. యూనిఫాంలో ఉన్నంతవరకూ నీ డ్యూటీ శాంతి భద్రతలను పరిరక్షించడమే. రాజకీయాలు చర్చించాలనుకుంటే యూనిఫాం తీసేసి బయటకు

వచ్చి మాట్లాడు అంటూ చాలా తీవ్రంగా అన్నారు. ఆయనలో అంత తీవ్రత ఉంటుందని అంతవరకూ ఊహించనైనా లేదు. 1990 ఫిబ్రవరిలో పులివెందులలో వై.యస్. రాజారెడ్డి ఎరుకలవారి ఇండ్లను తగలపెట్టి డైనమెట్లతో కూల్చివేసిన ఘటనపై బాలగోపాల్‌సార్ రాకముందే మేము నిజనిర్ధారణ చేసాము. రాజారెడ్డి చర్యలను నిరసిస్తూ పులివెందులలో బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించుకున్నాము. సార్ మీటింగుకు వచ్చాడు. మైకు, బ్యాటరీ, షామియానా, గుంజలు అన్నీ ప్రొద్దుటూరులో తీసుకొని జీపులో పులివెందులకు బయలుదేరాము. గుంజలు పాతి, షామియానాకట్టి, మైకుపెట్టి, లైబ్రరీ అరుగుపై మీటింగు పెట్టాము. మీటింగు ప్రాంగణమంతా పోలీసులతో నిండిపోయింది.

వైయస్ అకృత్యాలతోపాటు పోలీసుల దురాగతాలను విమర్శిస్తూ సభ జరిగింది. మీటింగ్ అయిన తర్వాతరోజు కడప పోలీసు సంఘం ప్రెసిడెంటు 'బాలగోపాల్! మేము రక్షణ కల్పించకపోతే పులివెందుల పొలిమేరలు దాటేవాడివా! ఆ కృతజ్ఞత కూడా లేకుండా మమ్మల్నే విమర్శిస్తావా అని ప్రకటన ఇచ్చాడు. మీ సాయం లేకుండా మీటింగు జరుపుకోలేని పరిస్థితి ఉందంటే మీ అసమర్థతే కదా. ఒక్క ఏ.పి.సి.యల్.సి. రక్షణే కాదు మొత్తం పౌరులందరి శాంతి భద్రతలు కాపాడడం మీ కర్తవ్యం. మీ కర్తవ్యం మీరు నిర్వహించినందుకు కూడా కృతజ్ఞతలు పొందాలనుకోవడం మీ దౌర్భాగ్యం అని జవాబు ఇచ్చాడు సార్. ఏ.పి.సి.యల్.సి. కోసం ఎవరు ఎంత చిన్న పని చేసినా ఆయన సంతోషించేవాడు. తనకోసం ఎదురు చూడకుండా మా అంతకు మేము చొరవ తీసుకొని పనిచేసినపుడు ఆయన సంతోషం మరింత ఎక్కువయ్యేది. పులివెందుల సమస్య తర్వాత నేను హైదరాబాద్ పోయినప్పుడు ప్రత్యేకంగా సెక్రటేరియట్ వద్ద ఉన్న ఫిష్ క్యాంటిన్‌లో బిర్యాని తినిపించాడు. అరుదైన ఆయన మెచ్చుకోలు ఎప్పటికీ గుర్తుండే జ్ఞాపకం.

ఆధిక్యం మచ్చుకైనా చూపేవాడు కాదు

అవగాహన రీత్యాగానీ, కష్టనష్టాలకు ఓర్చుకొనే విషయంలో గానీ బాలగోపాల్‌కూ మాకూ మధ్య చాలా తేడా వుండేది. అయితే ఆ దూరాన్ని ఎప్పుడూ కనపడనిచ్చేవాడు కాదు. పనిలోనేకాదు, వ్యవహార సరళిలోనూ ఎక్కడా తన ఆధిపత్యం మచ్చుకైనా కనపడేదికాదు. బాలగోపాల్ పరిచయం అయ్యాక చాలాకాలం ఆయన్ని బాలగోపాల్ అనే పిలిచేదాన్ని. అనంతపురం శేషయ్యను మాత్రం సార్ అని పిలిచేదాన్ని. ఒకసారి బాలగోపాల్ ఈ విషయం అడిగాడు. ఆయన పెద్దాయన కాబట్టి సార్ అని పిలుస్తున్నాను అని నేను చెప్పిన సమాధానానికి బాలగోపాల్ చాలాసేపు నవ్వాడు. అతను నాకన్నా చాలా చిన్నవాడు అని చెప్పాడు. అలాగే స్థానిక లారీ వర్కర్

యూనియన్ సభ్యులు సార్ కంటే నేనే ఎక్కువ అనుకునేవారు. మీ డ్రెస్‌వల్ల వాళ్ళు మిమ్మల్ని అలా అనుకుంటున్నారు, మంచివి వేసుకోవచ్చు కదా అంటే డ్రస్సుతో వచ్చే గుర్తింపు నాకు అక్కర్లేదు అనేవాడు. అంతకు మించి వారితో కలిసి పోవడాన్ని ఎంజాయ్ చేసేవాడు. మామూలు జనం దగ్గర, కార్యకర్తల దగ్గర ఎంత సాధారణంగా ఉన్నా అవసరమొచ్చిన చోట అవసరమైనప్పుడు అంతఅసాధారణంగా స్పందిస్తాడు. ఈ రెండు పనులు అత్యంత సహజంగా చేయడమే ఆయన గొప్పతనం. అన్నలతో నాకున్న పరిచయం ఏ.పి.సి.యల్.సి. పనికి ఇబ్బంది కాకుండా చూసుకోమంటూ తరచూ చెప్పేవాడు. అప్పట్లో నాకదేమీ అర్థమయ్యేది కాదు. "ప్రజలకు ఉపయోగపడాలంటే ఏ.పి.సి.యల్.సి.ని స్వతంత్రంగా వుండనివ్వండి. అన్నల పరిచయాలను ప్రదర్శించుకోవడానికి ఏ.పి.సి.యల్.సి. వేదిక కాదని" అప్పటికీ చెప్పేవాడు. అన్నల మీద పోలీసులు ఏ స్థాయిలో హింస జరిగినా వస్తావు కానీ అన్నల పరిచయం వద్దంటావేం అని నా సణుగుడు. చాలాకాలం తర్వాత చాలా అనుభవాలు అయ్యాక కాని నాకు తత్వం బోధపడలేదు. తుపాకిగొట్టం ద్వారా రాజ్యాధికారం అన్న స్లోగన్ చూసి అన్నలు కూడా ఎన్నికల్లో నిలబడి మా లీడర్ల మాదిరిగా రిగ్గింగ్ చేసుకోవచ్చుకదా అని అడిగాను ఒకసారి. సార్‌కు మొదట నా ప్రశ్న అర్థం కాలేదు. ఆశ్చర్యపోయి చాలాసేపు నవ్వి రాజ్యాధికారం ప్రజలకు కావాలి గాని అన్నలకు కాదు అన్నాడు.

కడప జిల్లాకు సంబంధించి మేము చేసిన ముఖ్యమైన పనుల్లో ఫ్యాక్షనిజంపై పరిశీలన ఒకటి. నా దగ్గరకు వచ్చే అన్ని కేసుల్లో బాధితులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఫ్యాక్షనిస్టులు వుండేవారు. ప్రొద్దుటూరు ప్రక్కన మాచనపల్లెలో భార్య ఎదుటే భర్తను కొట్టి, ట్రాక్టరుతో తొక్కించి చంపి శవాన్ని కాల్చేసినా ఆ భార్య మాత్రం నా భర్త బతికే ఉన్నాడంటూ వాంగ్మూలం ఇచ్చింది. దానికి కారణం ఏమిటంటే ఆమె ఇద్దరు కొడుకుల్లో ఒకరిని స్థానిక ఎమ్మెల్యే మనుషులు కిడ్నాప్ చేసి అలా చెప్పించారు. ఈ కేసులో బాధితులతో మాట్లాడాక సార్ చాలా కదిలిపోయాడు. అలాగే ఎపుడో ఆస్తిలో భాగం పంచుకుపోయిన అన్న కొడుకు చిన్నాన్నను, అత్తలను స్థంభానికి కట్టేసి వారి వాటా ఆస్తిని కూడా బలవంతంగా రాయించుకొన్న కేసులో స్థానిక ముఠా రాజకీయ నాయకుల వైఖరికి ఆశ్చర్యపోయాడు. వీటన్నింటినీ ఎండగడుతూ సార్ రాసిన కరపత్రాలు అప్పట్లో అక్కడ పెద్ద సంచలనం. ఇలాంటి కేసుల్లో పనిచేస్తున్న క్రమంలోనే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, ఇది ఆటంకంగా ఉందని, ముఠానాయకుల హింసను వ్యతిరేకించడం కూడా పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యమేననే అవగాహన ఏర్పడింది. కర్నూలు జిల్లా

పాలెగాళ్ళ సమస్యను తీసుకున్నపుడు 'ఫ్యాక్షన్ హింసను వ్యతిరేకించడం హక్కుల సంఘాల అజెండాలో చేరడానికి కారణమైన మీరు కూడా కర్నూలు జిల్లా ఫ్యాక్షనిస్టులపై చేస్తున్న నిజనిర్ధారణకు హాజరైతే బాగుంటుంది' అంటూ బాలగోపాల్ రాసిన ఉత్తరం ఏ.పి.సి.యల్.సి. పనిలో నాకు చాలా తృప్తినిచ్చిన జ్ఞాపకం.

'కండక్టర్'సార్

కర్నూలు జిల్లా పాలెగాళ్ళ పుస్తకం వచ్చాక కడపజిల్లా ఫ్యాక్షన్లపై చాలా విస్తృతంగా తిరగాల్సి వచ్చింది. అన్నలనుంచి బయటికి వచ్చి పునరావాసం క్రింద జీపు నడుపుకొనే ఓ మిత్రుడు ఉండేవాడు. జీపు ఓనర్ కమ్ డ్రైవర్. సార్ వచ్చిన ప్రతిసారీ అద్దె లేకుండా జీపు ఇచ్చేవాడు. డీజల్ మాత్రం మేము పోయించేవాళ్ళం. మేము మహా అయితే ముగ్గురు నలుగురం ఉండేవాళ్ళం. ఆ జీపు టెన్ సీటర్. ఖాళీగా పోవడం ఎందుకూ, ఎవరినైనా ప్యాసింజర్లను ఎక్కించుకుంటే ఆ డబ్బు డీజిల్‌కైనా వస్తుంది కదా అనేవాడు ఆ జీపు మిత్రుడు. అలా అతను జీపు నడుపుతుంటే, సార్ ప్యాసింజర్లను ఎక్కించుకుని వారినుంచి డబ్బులు వసూలు చేసే కండక్టర్ అయ్యేవాడు. దానిమీద ఎన్ని జోకులో. ఎపిసియల్‌సికి ప్రయోజనకరమనుకున్న ఏ పని చేసేందుకయినా బాలగోపాల్ సంశయించేవాడు కాదు. అది కండక్టరు పని అయినా, కరపత్రాలు పంచడం అయినా, పోస్టర్లు అంటించడమైనా... ఏదీ ఆయనకు తక్కువ పనులు కావు. చిన్నవీ కావు. కాశ్మీర్‌పై నివేదికను ఎంత శ్రద్ధగా రాసేవారో – ఓ వరకట్న బాధితురాలి కరపత్రాన్నీ అంతే శ్రద్ధగా రాసేవారు.

వై.ఎస్‌ను కలిసినపుడు

పాలెగాళ్ళ నివేదిక రూపొందించే క్రమంలో మేం చాలా విస్తృతంగా తిరిగాం. దాదాపు అందరు ఫ్యాక్షనిస్టులను కలిశాం. నాయకులుగా చలామణిలో ఉన్న ఫ్యాక్షనిస్టులతో మాట్లాడేటప్పుడు బాలగోపాల్ చాలా షార్ప్‌గా రియాక్టు అయ్యేవారు. ఆయన మాటల్లో ఎదుటివారి నోరు టక్కున మూయించే పదునే కాదు తెగువా కనిపించేది. మనం ఏమి మాట్లాడుతున్నాం అన్న అంశం తప్ప ఎవరితో మాట్లాడుతున్నాం అన్న అంశాన్ని పట్టించుకున్న దాఖలాలు ఎప్పుడూ కనిపించలేదు. అందర్నీ కలిసినట్టే పులివెందులలో వై.యస్. రాజశేఖరరెడ్డిని కలిశాం. జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలను కొత్త పుంతలు తొక్కించిన రాజశేఖరరెడ్డి తన వాదనను చెపుతున్నాడు. మేం మధ్య మధ్యలో ప్రశ్నలు అడుగుతూ వున్నాం. ఆయన తండ్రి రాజారెడ్డి స్థానిక ఎరుకలవారి ఇళ్ళను కూల్చేసిన అంశం ప్రస్తావనకు వచ్చింది. దానికి "అవును, మా నాన్న బాగా ఆవేశపరుడు. కళ్లెదుట అన్యాయం జరుగుతుంటే

సహించలేదు. ప్రత్యక్ష చర్యలకు పూనుకుంటాడు. అదే నక్సలైట్లలాగా అన్నమాట...” అంటూ తన తండ్రి చర్యను సమర్థించుకున్నాడు వై.యస్. ఆ సమయంలోనే రాజశేఖరరెడ్డి కొడుకు జగన్ సింహాద్రిపురం పోలీసుస్టేషన్‌పై దాడిచేసి తన మిత్రులను విడిపించుకుపోయాడన్న వార్త పేపర్లో రిపోర్టు అయ్యింది. ఈ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు “అవును, అక్కడ పోలీసులు కొందరిని అక్రమంగా నిర్బంధించారు. మావాడు వెళ్ళి వారిని విడిపించుకొచ్చాడు. పౌరహక్కుల సంఘాలలో మీరు చేసే పనినే మా అబ్బాయి చేసాడు” అని సమర్థించుకున్నాడు. “ప్రభుత్వం, పోలీసులు కలిసి నక్సలైట్లను కాల్చి చంపుతారు. హక్కుల సంఘాలవారిపై తప్పుడు కేసులు పెడతారు. కాని మీ ఇంట్లో వాళ్లపై ఈ రెండూ జరగలేదు కదా” అంటూ బాలగోపాల్ బదులిచ్చారు. అటువైపు నుంచి జవాబు లేదు. మేం బయటకు వచ్చేటప్పుడు వై.యస్. రాజశేఖరరెడ్డి హరగోపాల్‌ను మాత్రం అక్కడ ఉన్న వారికి “ఈయన పెద్దమనిషి, గౌరవస్తుడు” అని పరిచయం చేస్తూ బాలగోపాల్ గురించి ఏం మాట్లాడలేదు. “వై.యస్. పార్లమెంటేరియన్, ఆయన తండ్రి నక్సలైటు, కొడుకు పౌరహక్కుల సంఘం. వై.యస్. ఇంట్లోనే అన్ని సంఘాలు వున్నాయి. మనకు ఏమీ మిగల్లేదు” అంటూ హరగోపాల్ వేసిన జోక్‌కు నవ్వుకుంటూ తిరుగు ప్రయాణం అయ్యాం.

తర్వాత ప్రొద్దుటూరులో ఎం.వి. రమణారెడ్డిని కలిశాం. ఆయన కవి, రచయిత. ట్రేడ్‌యూనియనిస్ట్. వామపక్ష రాజకీయాలనుంచి పార్లమెంటు రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు. ఒక ఫ్యాక్షనిస్టుకు ఇన్ని అదనపు అర్హతలు ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. తన రాజకీయ ప్రస్థానాన్ని ఆయన తనదైన శైలిలో చెప్పుకుంటూ వచ్చాడు. నిజంగా రమణారెడ్డి ఫ్యాక్షనిస్టు కాడేమో అని మనకు అనిపించేంత చాతుర్యంతో మేధోఅహంభావం తొణికిసలాడుతుండగా వాదనలు చెప్పుకుంటూ వచ్చాడు. అంతా విన్నాక చివర్న బాలగోపాల్ చాలా నెమ్మదిగా కుటుంబ ఖర్చులకు మీ ఆదాయ వనరు ఏమిటి అని అడిగాడు. అప్పుడాయన ఎంత విలవిలలాడాడో ఇప్పటికీ నాకు బాగా గుర్తు. కనీసం చెప్పుకునేందుకు రాజశేఖరరెడ్డికి ముగ్గురాయి గనులూ, వరదరాజుల రెడ్డి, గుండ్లకుంట శివారెడ్డి లాంటి వారికి వ్యవసాయ భూములూ ఉన్నాయి. ఆదాయ వనరుగా చెప్పుకునేందుకు ఏమీలేని వ్యక్తి ఎం.వి. రమణారెడ్డి. బాలగోపాల్ అడిన చిన్న ప్రశ్న అంతవరకు ఆయన ఒలకబోసిన మేధోతనాన్ని వెలవెలబోయేటట్లు చేసింది.

మొన్నటి 2009 ఎన్నికలప్పుడు ఎమ్మెల్యే డి.యల్ రవీంద్రారెడ్డిని కలిశాం. రవీంద్రారెడ్డి మాతో మాట్లాడుతూ “నక్సలైట్లు రావాలి. అప్పుడు కానీ ఈ ప్రాంతం బాగుపడదు. అయినా ఇప్పుడు వాళ్లు కూడా చెడిపోయారంట కదా” అన్నాడు.

రవీంద్రారెడ్డి మాట పూర్తయ్యీ కాకముందే “అది మీ అదృష్టం” అన్న మాటలు బాలగోపాల్ నుంచి దూసుకొచ్చాయి. ఒక్క మాటలో ఎన్ని జవాబులో! ఎదుటి వ్యక్తి ఎంతటి వాడైనా అవసరమైనప్పుడు చాలా షార్పుగా రియాక్టు అయ్యేవాడు బాలగోపాల్.

హక్కులనేత నోట నిషేధం మాట!

కడప జిల్లా ఫ్యాక్షన్లపై చాలా పల్లెలు తిరిగాము. చనిపోయిన కుటుంబాల వారినీ, కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కుటుంబాలవారినీ, తగలబడిపోయి మొండి గోడలతో మిగిలిన గ్రామాలనూ ఇలా ఫ్యాక్షన్ మిగిల్చిన విషాదాలను చాలా చూశాం. ఈ క్రమంలో బాలగోపాల్ ఒకమాట అన్నాడు. సివిలైజేషన్ ఇన్ బీహార్ అన్న పుస్తకం తెలుగులో రాకుండా చూడాలి. తెలుగులోనైనా, ఇంగ్లీషులోనైనా రాయలసీమలో ఆ పుస్తకాన్ని నిషేధించాలి అని అన్నారు. ఒక హక్కుల నేత ఒక పుస్తకాన్ని నిషేధించాలి అనడం అక్కడున్న కొందరికి ఆశ్చర్యం అనిపించింది. “రాయలసీమ ముఠాకక్షల్లో ఇప్పటికే అంతులేని హింస వుంది. దానికి తోడు బీహార్‌లో ఉన్న క్రొత్త క్రొత్త పద్ధతులను ఇక్కడివారు తెలుసుకుంటే పౌర సమాజానికి జరిగే నష్టం మరింత ఎక్కువగా ఉంటుంది”. అంటూ వివరణ ఇచ్చారు. బీహార్ పద్ధతులు ఇక్కడ పరిచయం కాకపోయినా, నక్సలైట్ల పద్ధతులు ఫ్యాక్షన్‌లోకి ప్రవహించడం, టి.వి. బాంబులు, కారుబాంబులు వగైరా కొత్త పోకడలతో ముఠా ఘర్షణలు మరింత రక్తసిక్తం కావడం మనం అనంతపురం జిల్లాలో చూశాం. ముఠా సంస్కృతి, ప్రభావాల కారణంగా స్థానిక ప్రజా సమస్యలపై వివిధ సంఘాల ఫోకస్ తగ్గిపోవడాన్ని కూడా ఆయన గమనించారు.

ప్రొద్దుటూరు సమీపంలోని మాలెపాడు గ్రామంలో కలుషిత నీటివల్ల 30 మంది చనిపోతే జిల్లా వ్యాపితంగా ఒక్క ఆందోళనా లేకపోవడం ఆయన్ను చాలా బాధించింది. సమీపంలోని ఆర్‌టిపిపి (రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు) నుంచి వచ్చే కలుషిత నీరు మాలెపాడు తాగునీటి కాల్వలో చేరడం ఈ మరణాలకు కారణం. ఒకే గ్రామంలో 30 మంది చనిపోతే ఆ వార్తను పత్రికలు కూడా జిల్లా పేజీలకే పరిమితం చేయడం మరింత దుర్మార్గం అని అన్నాడు. ఇక్కడ నుంచి విజయవాడ వెళ్ళి అక్కడ ప్రెస్‌మీట్‌లో మాలెపాడు సంఘటనను వివరించి ఆ వార్తను జిల్లాకే పరిమితం చేసిన పత్రికల వైఖరిని ఎండగట్టారు. దీంతో ఆ తర్వాత ఆ సంఘటనపై ‘ఈనాడు’ స్టేట్ పేజీలో వార్త ఇచ్చింది. ఈ సమస్యపై బాలగోపాల్ హైకోర్టులో వేసిన పిటిషన్ ఫలితంగా ఆర్‌టిపిపి కలుషిత నీరు గ్రామ తాగునీటి వనరుల్లో కలవకుండా చూశారు.

మిగతా జిల్లాల పరిస్థితికి కడప జిల్లా పరిస్థితికి చాలా తేడా వుంది. ఇక్కడ ముఠా రాజకీయాల చుట్టూనే అందరూ తిరుగుతూ ఉంటారు. ప్రజా సమస్యలపై సీరియస్‌గా పనిచేసేవారు తక్కువ. కాబట్టి కడప జిల్లాలో మనం మరింత ఎక్కువగా పనిచేయాలి, ఏ.పి.సి.యల్.సి.ని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలి అన్న బాలగోపాల్ మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి.

ఊకదంపుడు ఉపన్యాసాలు, సిద్ధాంత రాద్ధాంతాలు ఏమీ లేకుండానే, మనచుట్టూ జరిగే సంఘటనల నేపథ్యంలోనే క్లిష్టమైన విషయాలను విపులీకరించడం, ఆచరణకు సంబంధించి ఒక స్పష్టత ఇవ్వడం నిరంతరం జరిగేది. నేను కమ్యూనిజం గురించి చదవలేదు. చదివినా అర్థంకాదు. రాయడం అలవాటు లేదు. సభల్లో పెద్దగా మాట్లాడలేను ఇవన్నీ లేకుండా ఆర్గనైజేషన్ పని ఏం చేయగలనని మథనపడేదాన్ని. దానికి బాలగోపాల్ అవన్నీ మరచిపో, మనకు ఎంత పాండిత్యం ఉందన్నది ముఖ్యం కాదు. ప్రజలకు ఏమేరకు ఉపయోగపడుతున్నాం. ఎంత నిజాయితీగా ఉన్నాం అన్న విషయాలే ప్రధానం అంటుండేవాడు.

అన్నల నుంచి బయటకు వచ్చిన వారి ఆచరణ చూసి బాలగోపాల్ ఆశ్చర్యపోయేవాడు. "వీళ్ళు పార్టీలో ఏమి నేర్చుకుంటున్నారు? బయటకు వచ్చీ రావడంతోనే పార్టీ విధానాలకు పూర్తి భిన్నంగానేకాదు, సాంఘిక వ్యతిరేక శక్తులుగా ఎలా మారుతున్నారు? డబ్బు సంపాదన యావ మామూలు వారిలో కన్నా 'పార్టీ' నుంచి బయటకు వచ్చిన వారిలో ఎందుకు ఎక్కువ ఉంటోంది?" అంటూ ఆశ్చర్యపోయేవాడు. ప్రజలకోసం పనిచేసేవారు నిజాయితీగా విమర్శ, ఆత్మవిమర్శ చేసుకోవాలని చెప్పేవాడు. అలాకాకుండా విమర్శకే పరిమితమైనవారినీ, ఇతరులు అడుగుతున్నారు కాబట్టి ఒప్పుకుంటామనే వారినీ ఎద్దేవా చేసేవాడు.

చంద్రబాబుపై అలిపిరి వద్ద జరిగిన దాడి తర్వాత ప్రభుత్వం విపరీతమైన నిర్బంధాన్ని అమలు చేసింది. అప్పుడు బాలగోపాల్‌తో కలిసి నిజనిర్ధారణకు వెళ్లాం. పోలీస్ అత్యాచారాలను వ్యతిరేకించకపోతే పోనీ, కనీసం మమ్మల్ని కలిసి విషయాలు చెప్పేందుకు కూడా అక్కడున్న ప్రజాసంఘాల బాధ్యులు ముందుకు రాలేదు. ఈ సంఘటన బాలగోపాల్‌ను కలవరపరచింది. పోరాటాలు, త్యాగాలు అంటూ ఉపన్యాసాలు ఇచ్చేవారు ఇబ్బందికర పరిస్థితులు వచ్చినపుడు ఎవరి పాటికి వారు భద్రత చూసుకుంటూ మిగిలిన వారిని పట్టించుకోకుండా వుండటాన్ని దురదృష్టకరంగా భావించాడు.

కుటుంబ సభ్యుడిలాగే ఉండేవాడు

నా కొడుకు నాలుగేళ్ల వయస్సున్నప్పటి నుంచి బాలగోపాల్ మా ఇంటికి వచ్చేవాడు. వాడు అడిగే ప్రశ్నలకు ఓపికగా జవాబు చెప్పేవాడు. చిన్నప్పుడు మావాడు

'ఎప్పుడూ మాటలు.. మాటలు... నువ్వు వద్దుపో' అనేవాడు సార్‌తో. ఒక్కరోజే కదరా అంటూ సంజాయిషీ ఇచ్చుకునే ధోరణిలో వాడిని కన్విన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. బాలగోపాల్ వచ్చినపుడు మావాడి స్కూలు ఫంక్షన్ ఉంటే మాతోపాటు ఆయనా వచ్చేవారు. ఫంక్షన్‌లో నా కొడుకు మాట్లాడుతుంటే, 'నీకన్నా నీ కొడుకే నయం జయశ్రీ' అంటూ జోక్ చేసేవాడు. నన్నే కాదు, గడియ గడియకూ కాఫీ ఇచ్చే అక్తాబ్‌నూ, నిమిషానికో డౌట్ అడిగే నా కొడుకునూ భరించేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే బాలగోపాల్ మా కుటుంబంలో ఒక సభ్యుడిలాగే ఉండేవాడు కుటుంబంలోని కష్టసుఖాలూ, ఇబ్బందులూ అన్నీ ఆయనకు చెప్పుకునే వాళ్లం. అన్నీ వినేవాడు. అయితే ఎప్పుడూ నేరుగా సలహా చెప్పడు. జోక్యం చేసుకోడు. అయినా కుటుంబ విషయాలన్నీ బాలగోపాల్‌కు చెపితే, కాస్త తేలికపడేవాళ్ళం.

ఓ మోరల్ సపోర్టులా భావించే వాళ్లం. కాని ఆర్గనైజేషన్ పనిలో లేకపోతే ఆయనకు మనతో మాట్లాడేందుకు మాటలేమీ ఉండవు. పదేళ్లపాటు జిల్లాలో పనిచేసిన నేను మధ్యలో మా అబ్బాయి చదువుకోసం మూడేళ్లు హైదరాబాద్‌లో ఉండాల్సి వచ్చింది. ఆ మూడేళ్ల కాలంలో బాలగోపాల్ మాట్లాడడం కానీ కలవడం కానీ చాలా తక్కువే. కలిసిన ఒకటి రెండుసార్లు ఆయన నన్ను 'మేధోమాత' అంటూ ఎగతాళి చేసేవారు. ఎపిసియల్‌సి నుంచి ఒక దశలో వెళ్లిపోవాలనుకున్న నాతో 'పని చేయి మీ జిల్లాలో మాట్లాడేవాళ్లే లేరు. నీ పనే విమర్శలకు జవాబు' అని ఎంతో ఆత్మస్థైర్యం నిలిపాడు. ఆర్గనైజేషన్ ఇంకా విస్తరించాలి, పనిచేయాలి, ఇంకా కొత్త సమస్యలపై పని చేయాలి. ప్రజలకు చేరువగా వుండాలని ఆయన గోడు. ఎప్పుడు నేను అలసిపోయి పడుకున్నా 'శరీరానికి ఏది అలవాటు చేస్తే శరీరం అదే అలవాటు చేసుకుంటుంది' అని చెప్పేవాడు. నా కాలుగోరు పూర్తిగా పోతే కూడా నేను విచిత్రం చేస్తానని ఆయన వెక్కిరింపు. 'నాకు ఎప్పుడూ పోతూనే వుంటాయి, ప్లాస్టర్ వేసుకుంటే చాలు' అని ఆయనా, 'నీ కాలు కాదు సార్ నా కాలు' అని నేనూ. మంచి ఎండల్లో కూడా మోటార్ బైక్‌మీద 100-150 కిలోమీటర్లు తిప్పేవాడు. సార్ సన్‌స్ట్రోక్ వస్తుందని చెప్తే కూడా సన్ మంచివాడు సన్ (కొడుకు) తోనే ప్రమాదం అనేవాడు.

రాయలసీమ కరువు, వెనుకబాటుతనం, ఫ్యాక్షన్స్‌కు వ్యతిరేకంగా 1996లో రాయలసీమ ప్రజాసమితి ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా బాలగోపాల్, అధ్యక్షుడిగా సి.హెచ్. చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శిగా సంధ్య తదితరులతో కమిటీ ఏర్పాటైంది. రాయలసీమ జిల్లాల్లో ఎన్నో సభలు, సమావేశాలు జరిపాం. రాయలసీమ ప్రాంతానికి అన్ని రంగాలలో జరిగిన అన్యాయాన్ని తెలియజేయడానికి నవంబర్ ఒకటిన 'విద్రోహదినం' అన్ని పార్టీలతో కలిసి జరపాలనుకున్నాం. అయితే సభావేదిక మొత్తం

వై.యస్. రాజశేఖరరెడ్డి, ఇతర కాంగ్రెసు నాయకులతో నిండిపోయింది. వేరే ఎవరూ లేరు. దీంతో బాలగోపాల్, హరగోపాల్ ఇద్దరూ వేదిక ఎక్కలేదు. ప్రజల్లోనే కూర్చున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకు బాలగోపాల్‌ను, సి.హెచ్. చంద్రశేఖరరెడ్డిని రాయలసీమ ప్రజాసమితి నుంచి తొలగించారని తెలిసింది. రాయలసీమ ప్రజాసమితిలో మేము ఏమి సాధించామో చెప్పలేము కానీ "విద్రోహదినం నా రాజకీయ జీవితంలో పెద్ద టర్నింగ్ పాయింట్" అని పదవి చేపట్టిన తర్వాత వై.యస్. అనడం మాత్రం చాలా బాధ కలిగించింది.

'మీకు చెబితే రాష్ట్రానికి చెప్పినట్లే'

మానవహక్కుల వేదిక ద్వారా 2002 నుంచి కడప జిల్లాలో కార్యకలాపాలను చేపట్టాం. పని మొదలుపెట్టిన కొత్తలో మా సభ్యుడు ఒకరు ఎపిసియల్‌సికి ఉన్నంత గుర్తింపు మనకు లేదు అన్నప్పుడు పనిచెయ్యి గుర్తింపు అదే వస్తుంది అన్నాడు బాలగోపాల్. ఒకసారి మా జిల్లాలో చికెన్‌గునియా వ్యాధి తీవ్రంగా ప్రబలినప్పుడు బాలగోపాల్ సార్‌ను రాయచోటికి రమ్మని పిలిచాము. చిన్న చిన్న సమస్యలకు కూడా సార్ ఎందుకూ అని నేను అన్నాను. కానీ సార్ వచ్చిన తర్వాత అక్కడ పి.హెచ్.సి. డాక్టర్ ప్రభుదాసు చికెన్‌గునియా రోగాన్ని గురించి, దాని నివారణ, చికిత్స గురించి వివరంగా చెప్పాడు. పారాసిటమాల్, బ్రూఫెన్ టాబ్లెట్స్‌తో నయమయ్యే జబ్బుకు ప్రైవేటు డాక్టర్లు వేలకు వేలు దోచుకుంటున్న సంగతులన్నీ సార్ దృష్టికి తీసుకొచ్చాడు. చివర్లో 'మీకు చెబితే రాష్ట్రానికి చెప్పినట్లే సార్' అని ముగించాడు.

ప్రతిపక్షంలో వున్నప్పుడు నల్గొండలో యురేనియం ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యమాల్లో పాల్గొన్న రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిలో భాగమంటూ పులివెందులలో యురేనియం ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలు పెట్టినాడు. రేడియేషన్‌తో ప్రజలకు రాబోయే ఇబ్బందుల గురించి కరపత్రం వేశాం. చుట్టుప్రక్కల గ్రామాల్లో సభలు సమావేశాలు జరిపాం. వై.యస్. కంచుకోటగా వున్న ఈ ప్రాంతంలో వాళ్ళకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ముందుకు వచ్చి ఎం.ఆర్.ఓ. ఆఫీసు దగ్గర ప్లాంట్‌ను నిరసిస్తూ ధర్నా జరపడమంటే ఆలోచించండి. ఇలా జరగడం జిల్లా వాసులందరినీ ఆశ్చర్యపరిచింది. దాదాపు 500 మంది ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పబ్లిక్ హియరింగులో కూడా పాల్గొన్నారు. అయితే మహా సౌమ్యుడైన ఎం.ఎల్.ఎ. వై.యస్. వివేకానందరెడ్డి నూరు మంది గూండాలతో ముందుగానే సభను ఆక్రమించి బాధిత రైతులను మాట్లాడనివ్వలేదు. పైగా మనల్ని బాగా తిట్టాడు. అక్కడ హెచ్.ఆర్.ఎఫ్.ను తరిమికొట్టండని నినాదాలు రాసారు. ప్లాంట్‌కు అనుకూలంగా మాట్లాడే వారిని తప్పించి వేరే ఎవర్నీ సభలో మాట్లాడనివ్వలేదు.

చివరకు బాలగోపాల్ సార్ పబ్లిక్ హియరింగ్ బాయ్‌కాట్ చేస్తున్నామని వేదిక ఎక్కి చెప్పాడు. ప్లాంట్ ఏర్పాటువల్ల మీకు కష్టాలు ఎదురైనపుడు తప్పకుండా మీరే మమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని చెప్పాడు. ఆ తరువాత పబ్లిక్ హియరింగ్‌లో మాట్లాడనివ్వలేదని, తమ కష్టాలను వినలేదని నాలుగు గ్రామాల ప్రజలు సభను ముగించుకొని వస్తున్న వై.యస్. వివేకానందరెడ్డినీ, కలెక్టరునూ మొబ్బచింతలపల్లెలో అడ్డగించి బాగా తిట్టారు. తిట్లు ఎంతకూ ఆపకపోవడంతో ఏమిచేయాలో దిక్కు తోచక కూర్చొని మాట్లాడుదాం అని నమ్మకంగా చెప్పి నాలుగు అడుగులు ముందుకేసి పరుగెత్తి కారెక్కి పారిపోయారు వాళ్లు. ఆ తరువాత కలెక్టరుగారు పబ్లిక్ హియరింగ్ సజావుగా జరిగిందని రిపోర్టు పంపారు.

హెచ్ఆర్ఎఫ్ ప్రారంభం అయిన ఐదేళ్ళలోనే జిల్లాలో మంచి గుర్తింపు పొందింది. పదముగ్గురుతో జిల్లా కార్యవర్గం ఏర్పాటైన రోజు బాలగోపాల్‌లో ఎంతో సంతోషాన్ని చూశాం. వివిధ జిల్లాల్లో నిర్మాణాలు ఏర్పడి సంఘం బలపడుతున్న ఆనందాన్ని అనంతపురం సభల్లో మేం బాగా గమనించాం. రాష్ట్ర మహాసభలు దిగ్విజయంగా జరిగాయి. ఎవరి ఊళ్ళకు వాళ్ళం నిష్క్రమించాం.

'జయశ్రీ, నేను బాలగోపాల్‌ను, 10వ తేదీన వస్తున్నా. కడప జిల్లాకు వై.ఎస్.ఆర్. పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరుకు అబ్జక్షన్ ఫైల్ చేద్దాం. అలాగే నేలనూతన గ్రామంలో గాలేరు-నగరి సొరంగం తవ్వకం వల్ల ఇబ్బంది పడుతున్న లంబాడాలను కలుద్దాం. వాళ్ళకు వీళ్ళకు సీటు పెట్టమని చెప్పకుండా నా రిటర్న్ టికెట్టు నువ్వే కొను". ఇది సార్ చివరి ఫోన్. ప్రొద్దుటూరుకు వచ్చేందుకు బాలగోపాల్ తీసుకున్న టికెట్ ఆయన వద్దే ఉండిపోయింది. నేను ఇప్పటికీ రిటర్న్ టికెట్ తీసుకోలేదు.